

8లో

## పార్టీ బలోపేతమే లక్ష్యం

- అందరి సూచనలతో ముందుకెళ్తా
- ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తా..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- ధర్మారం పార్టీ ఆఫీసులో బాధ్యతలు స్వీకరణ


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 185 మంగళవారం | 23 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


# ఎడారిలా మానేరు

- చుక్క నీరు లేక వెలవెల
- మేడిగడ్డ పగుళ్లు, అన్నారం బుంగలతో ఖాళీ అయిన బ్యారేజీలు
- సాగు నీటికోసం రైతుల తండ్లాట
- వేసవిలో తాగునీటికి తప్పని తిప్పలు







తెలంగాణ రైతుల ప్రయోజనాలకోసం కాళేశ్వరం కడుతున్నా..రెండు సంవత్సరాల్లో దీనిపై పెట్టిన ఖర్చుకు సమాన లాభం వస్తుంది.. ఇప్పుడు రోజుకు రెండు టీఎంసీలకు ప్రాజెక్టు డిజైన్ చేశాం.. ఆరు నెలల్లో రోజుకు రెండు టీఎంసీల చొప్పున 360 టీఎంసీలు ఎత్తిపోసి 36 లక్షల ఎకరాలకు నీరిస్తాం.. తర్వాతి సంవత్సరం మూడో టీఎంసీకి డిజైన్ చేసి రోజుకు మూడు టీఎంసీల చొప్పున ఆరు నెలల్లో 540 టీఎంసీలు ఎత్తిపోస్తాం.. దీంతో 54 లక్షల ఎకరాలకు నీరిస్తాం. .అదే విధంగా హైదరాబాద్‌కు తాగునీరు, పరిశ్రమలకు కావాల్సినంత నీరిస్తాం.. దీంతో పంటలే పంటలు.. ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.. ఎత్తిపోతలకు విద్యుత్ ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందంటూ 2018 ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ చేసిన వ్యాఖ్య ఇది. నేడు పరిస్థితి తిరగబడింది. మేడిగడ్డ బ్యారేజ్ పగుళ్లు, అన్నారం బ్యారేజికి బుంగలు ఏర్పడటంతో నీటితో కళకళలాడాల్సిన మానేరు ఎడారిని తలపిస్తోంది. దీంతో రానున్న వేసవిలో తాగునీటికి సైతం తిప్పలు తప్పేలా లేదు.

**- వరంగల్ వాయిస్, మల్హర్**

వివరాలు 2లో..



## పార్థసారధికి స్వాగతం..

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ చిట్ల పార్థసారధి మేడారం పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి నగరానికి చేరుకోగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ అదనపు కలెక్టర్ మహేందర్ జీతోపాటు పలువురు పాల్గొన్నారు. **- వరంగల్ వాయిస్, హనుమకొండ**


## అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వర్ధం షాపింగ్ మాల్ ఆక్రమణల తొలగింపు

ఉపేక్షించేది లేదన్న కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా




8లో..



GREATER WARANGAL PRESS CLUB
Regd. No. 118/91
# 7-1-99/C, Opp: Fire Station, Balasamudram, Hanumakonda - 506 001.

President : Nagaraju Vemula Cell: 9849011899 | General Secretary : Bollarapu Sadaiah Cell: 9989696661 | Treasurer : Bolla Amar Cell: 9177992341

Date 23-1-2024

సమసిన వివాదం;

గ్రేటర్ వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి గారికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి గారికి మధ్య తలెత్తిన వివాదం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యుల మధ్యవర్తిత్వంతో సమసిపోయినది. ఇప్పటివరకు జరిగిన విషయాలను ఇక్కడితో వదిలివేయాలని ఇరువురు నిర్ణయించుకున్నారు. వివాద పరిష్కారానికి చొరవ చూపిన ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, బోళ్ల అమర్ లకు, ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ గారికి ఇరువురూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

(గడ్డం కేశవమూర్తి) G. Sudharani (Hon'ble MAYOR)

Treasurer Greater Warangal press club. B. Sadaiah (Gen. Secretary) Greater Warangal press club V. Nagaraju 23/01/2024 (President) Greater Warangal Press club.

## సమసిన వివాదం..

మేయర్ గుండు సుధారాణి, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తిల మధ్య తలెత్తిన వివాదం మంగళవారం ముగిసింది. ఇరువర్గాలు జరిగిన సంఘటనలను దురదృష్టకరంగా భావించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కీలక బాధ్యులు ముందుపడి వీరి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు.

**- వరంగల్ వాయిస్, వరంగల్**



# ఎడారిలా మానేరు

**చుక్క నీరు లేక వెలవెల**

**మేడిగడ్డ పగుళ్లు, అన్నారం బుంగలతో ఖాళీ అయిన బ్యారేజీలు**

**సాగు నీటికోసం రైతుల తండ్లాట**

**వేసవిలో తాగునీటికి తప్పని తిప్పలు**

**వరంగల్ వాయిస్, మల్హర్ :** నిత్యం నీటితో కళకళలాడే మానేరు నది ఎడారిని తలపిస్తోంది. గత సంవత్సరం జులై లో కురిసిన భారీ వర్షాలకు వరదలు రావడంతో వల్లెంకుంట, మల్లారం వద్ద మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాం లు కొట్టుక పోవడంతో మొత్తం నీరు గోదావరిలో కలిసిపోయింది. దీనికి తోడు మేడిగడ్డ బ్యారేజీకి పగుళ్లు, అన్నారం బ్యారేజీకి బుంగలు ఏర్పడటంతో బ్యారేజీల మరమ్మతుల నిమిత్తం మొత్తం నీటిని దిగువకి విడుదల చేయడంతో మానేరు నదిలో చుక్క నీరు లేక ఎడారిని తలపిస్తోంది. దీంతో మానేరు తీర ప్రాంత రైతుల యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. జనవరి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో తీవ్ర నీటి ఎద్దడి తప్పదంటున్నారు. మానేరు నదిలో వేసిన బోరు బావుల్లో సైతం నీటి మట్టం పూర్తిగా పడిపోవడంతో తాగునీటికి సైతం తిప్పలు తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### మేడిగడ్డకు అవినీతి పగుళ్లు..

మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో కోట్ల రూపాయలు వృథా అయినట్లు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగం అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. తొలుత మరిన్ని బ్లాకుల్లో సమస్యలున్నట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినా..ఇప్పుడు బ్యారేజీ మొత్తం సమస్యలున్నట్లు తేల్చింది. మరమ్మతులు చేసినా నిరుపయోగమేనని విజిలెన్స్ భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వానికి త్వరలో మధ్యంతర నివేదికను అందజేయనున్నారు. దీంతో మానేరు కథ కంచికేనా అన్న భావన వ్యక్త మవుతోంది.

### సాగు నీటికి తండ్లాట..

మరమ్మతుల్లో భాగంగా మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పూర్తిగా ఖాళీ చేయడంతో సాగునీటి కష్టాలు తప్పడం లేదు. మానేరు నదిలో చుక్క నీరు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనవరి మాసంలోనే నది పూర్తిగా ఎండిపోవడంతో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో వేసిన పంటలకు నీటి కష్టాలు తప్పేవా లేవంటూ మదన పడుతున్నారు. మానేరు నదిలో వేసిన బోర్లు సైతం అడుగంటడంతో ఉమ్మడి కరీంనగర్ తోపాటు, ఉమ్మడి వరంగల్ జిల్లా, హైదరాబాద్ ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

# ఆస్తికోసం అన్న ఘాతుకం

## వికలాంగురాలైన చెల్లిపై గొడ్డలితో దాడి



**వరంగల్ వాయిస్, ములుగు :** ఆస్తికోసం రక్త సంబంధాన్ని మరిచి వికలాంగురాలైన చెల్లి పొన్నం సారక్కపై సొంత అన్న సమ్మయ్య గొడ్డలితో దాడి చేసిన సంఘటన మంగళవారం ఉదయం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...లక్ష్మీదేవి పేటకు చెందిన పొన్నం శ్రీహరికి ముగ్గురు ఆడపిల్లలతో పాటు సమ్మయ్య సంతానం. వీరిలో ఒక అమ్మాయికి వివాహం జరిగింది. అనారోగ్య కారణాలతో శ్రీహరి మరణించడంతో తల్లి రాధమ్మతో వికలాంగులైన సమ్మక్క, సారక్కలు కలిసి ఉంటున్నారు. అనారోగ్యంపాలైన వారు శ్రీహరి ఇచ్చిన భూమిలో కొంత భూమిని ఇటీవల విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న సమ్మయ్య గత కొన్ని రోజులుగా ఆగ్రహంతో ఉన్నాడు. తనకు తెలియకుండా భూమిని ఎలా విక్రయిస్తారని పలుమార్లు పంచాయితీ చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ లో సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సారక్కతో గొడవ పెట్టుకున్న సమ్మయ్య ఆగ్రహంతో ఊగిపోతూ గొడ్డలితో తీవ్రంగా గాయపరిచాడు. దీంతో సారక్క అపస్మారక స్థితికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై చల్లా రాజు సంఘటనా స్థలానికి చేరుకుని సమ్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. సారక్కను వైద్యం కోసం అంబులెన్స్ లో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# భద్రకాళిని సందర్శించిన స్థపతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని దేవాదాయ ధర్మధాయ శాఖ స్థపతి వల్లీ నాయగం మంగళవారం సందర్శించారు. స్థపతి వెంట దేవాదాయ శాఖ ఈఈ దుర్గా ప్రసాద్, దేవాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతా రావు ఉన్నారు. ఆలయనికి విచ్చేసిన ప్రముఖులకు దేవాలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, దేవాలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ప్రముఖులకు అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డీఈఈ రమేశ్ బాబు, ఏఈఈ చందర్ రావు, సూపరింటెండెంట్ ఎం.వీరస్వామి పాల్గొన్నారు.



# ఆర్‌పీఐ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 28న హనుమకొండ జిల్లా కేంద్రం రాంనగర్ లోని నవతరంగాలు పత్రిక కార్యాలయంలో జరుగు రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆర్ పీఐ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త జన్ను సాంబయ్య పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదుల మీద నడుస్తున్న రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర సదస్సుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేసి బహుజన రాజ్య స్థాపనలో బాగం కావాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రం ఎన్జీఓ కాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల చేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక రాజకీయ విశ్లేషకులు సాయిని నరేందర్, సింగారపు అరుణ, సీనియర్ న్యాయవాది మైదాం జైపాల్, న్యాయవాదులు రాచకొండ ప్రవీణ్ కుమార్, భవాని ప్రసాద్, కూనూరు రంజిత్ గౌడ్, అన్వేష్, సాంబశివరాజు, సాగర్, రాజు, గణేష్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చాపర్తి కుమార్ గాడ్గే, బుర్రి సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# గుర్రంతో గొర్రు కట్టిన రైతన్న

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఎద్దులు, దున్నపోతులతో వ్యవసాయం చేయడం చూశాం కాని గుర్రంతో గొర్రు కట్టి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు ఓ రైతు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన రైతు మెరుగు రాములు ఆరు సంవత్సరాల క్రితం గుర్రమును కొనుగోలు చేసి పెంచుకుంటున్నాడు. తనకు ఒకే ఒక ఎద్దు ఉండడంతో మరోవైపు గుర్రమును నాగలి కానికి కట్టి పొలం మడిలో గొర్రు కొట్టాడు. గుర్రంతో గొర్రు కట్టడాన్ని చూసిన రైతులు, ప్రజలు ఆశ్చర్యంగా ముక్కున వేలేసుకున్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసులో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్ బీసీ వెల్ఫేర్ డీడీ గడ్డం రాంరెడ్డి అదే విధంగా అసిస్టెంట్ డైరెక్టర్ శంకరయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల కుమారస్వామి మాట్లాడుతూ అనేక సమస్యలతో నలుగుతున్న మా రజక వృత్తిదారులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ విధంగా ప్రభుత్వం కూడా గత పది సంవత్సరాల నుంచి రజక రజక వృత్తిదారులకు ఫెడరేషన్ నియమించాలి, ప్రత్యేక బడ్జెట్ను కేటాయించాలని, 50ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి పింఛన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి బాబు, పొట్లపల్లి రాజు, గొల్లపల్లి మొగిలి, రాచర్ల రమేష్, రాయిరాకుల సబిత, పొన్నం స్వప్న, పున్నమి నగేష్, చపతి సంపత్ , గుడికందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంగంరెడ్డి పృథ్వీరాజ్‌కు చట్టసభల్లో స్థానం కల్పించాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ కు చట్టసభల్లో స్థానం కల్పించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ కు చట్టసభల్లో స్థానం కల్పించాలని మంగళవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం చేస్తూ తను చేసిన ఉద్యమాలను గుర్తు చేస్తూ ఆంధ్ర పాలకులకు వ్యతిరేకంగా విద్యార్థి దశలో రబ్బర్ బుల్లెట్లకు లెక్కచేయకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థి దశలో కీలక పాత్ర పోషించిన పృథ్వీరాజ్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్టసభల్లో స్థానం కల్పించాలన్నారు. ఆ రోజులలో తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు కుటుంబానికి రూ.1000 చొప్పున ఇచ్చినటువంటి ఘనత డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ దని కావున ప్రభుత్వం ఈ అన్నింటిని దృష్టిలో పెట్టుకొని చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి, ప్రదీప్, సుకేష్, హరీష్, మధు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం రంగల్ జిల్లా కమిటి కొన్ని రోజుల నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆఫీస్ లలోకి వెళ్లి అధికారులను కలిసి జిల్లాలొని దివ్యాంగుల సమస్యలపై వివరించి, వాటిని పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆఫీస్ లలో వరంగల్ జిల్లా దివ్యాంగుల సంఘంకు సంబంధించిన క్యాలెండర్లను అంటించారు. ముఖ్యంగా ఈ క్యాలెండర్ లో 2016 దివ్యాంగుల చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా మంత్రి కొండా సురేఖ-మురళిధర్ రావును కలిసి అన్ని దేవాలయాలలో ముఖ్యంగా రాబోయే మేడారం జాతరలలో దివ్యాంగులకు ప్రత్యేక క్యూ లైన్ ను ఏర్పాటు చేసి, వీల్ చైర్ లు లోపలికి వెళ్లే విధంగా ర్యాంపులు ఏర్పాటు చెయ్యాలని కోరారు. అన్ని దేవాలయాల్లో టెండర్లలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలన్నారు. అటవీ శాఖలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టు లలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మనవి చేశారు.వరంగల్ జిల్లా కమిటీ చాలా చురుగ్గా పని చేస్తుందని జిల్లాలోని దివ్యాంగులకు అండగా ఉండి , వారి సమస్యలను పరిష్కరించుటలో సహాయ సహకరులు అందిస్తున్నారు. ఇక ముందు కుడా ఇలాగే పని చేయాలని కోరుతూ, రాష్ట్ర కమిటీ తరపున వరంగల్ జిల్లా కమిటి సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

# పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎన్నికలకు జిల్లాలోని పట్టభద్రులు తమ ఓటహక్కును ఫిబ్రవరి 6 లోపు ఫారం 18 (ఆన్లైన్ / ఆఫ్ లైన్) ద్వారా లేదా మండల తహసిల్దార్ కార్యాలయంలో, రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1,2020 నాటికి డిగ్రి ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులు ఇందుకు అర్హులన్నారు. గతంలో పట్టభద్ర ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకున్నప్పటికి తిరిగి మరల నమోదు చేసుకోవాలని తెలిపారు. పట్టపద్రుల ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్న వారి విద్యార్హత సర్టిఫికెట్ల కాపీలు గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించి సమర్పించాలని అన్నారు. జిల్లాలో గత ఎమ్మెల్సీ 2021 ఎన్నికల సందర్భంగా 10323 మంది పట్టభద్రులు నమోదు చేసుకొనగా, ప్రస్తుతం ఇప్పటి వరకు కేవలం 824మాత్రమే నమోదు చేసుకోవడం జరిగినదని, కాబట్టి ఫిబ్రవరి 6వ తేదీ లోగా జిల్లాలోని పట్టభద్రులు, విద్యార్థిని, విద్యార్థులు, వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న పట్ట భద్రులైన ఉద్యోగులు, అధికారులు సిబ్బంది అందరూ సకాలంలో నమోదు చేసుకోవాలని కోరారు. నవంబర్ 1, 2023 ప్రామాణికంగా ఓటరు జాబితా రూపొందిస్తున్నామని, నవంబర్ 1 ,2020 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్ట భద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అర్హులని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 6 లోపు ఫారం 18 ద్వారా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో నమోదు కొరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఫిబ్రవరి 24న డ్రాఫ్ట్ ఓటరు జాబితా రూపకల్పన చేస్తామని, మార్చి 14 లోపు డ్రాఫ్ట్ ఓటరు జాబితా పై అభ్యంతరాల స్వీకరిస్తామని, మార్చి 29 లోపు సదరు అభ్యంతరాలను పరిష్కరించే ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటరు జాబితాలో నమోదుకు డిగ్రీ మెమో ఒరిజినల్ లేదా ప్రొవిషనల్ సర్టిఫికేట్, ఓటర్ ఐడి కార్డు, పాస్ ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీలతో ఆన్‌లైన్ అప్లికేషన్స్ http://ceotserms2.telangana.gov.in/mlc/form18.aspx వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు అరవింద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్ :** ఇండియన్ బ్రిలియంట్స్ ఒలంపియాడ్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలలో గత నెలలో నిర్వహించిన ప్రథమ దశ పోటీ పరీక్షల్లో నగరంలోని రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ నుంచి 31మంది విద్యార్థులు పరీక్ష వ్రాయగా 8మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఆకుతోట శ్రీ చరణ్ (1వ తరగతి), కందగట్ల భావ్య (2వ తరగతి), బింగి మయూరి (3వ తరగతి), మునిబా కుద్రత్ ఉల్ ఎయిన్ సూది (3వ తరగతి), రావుల శివగణేష్ (4వ తరగతి), కోట దీపిక (4వ తరగతి) సుతారి సంకీర్తన (6వ తరగతి), సుతారి రక్షిత (6వ తరగతి). వీరు ఈ నెల 28న ఖమ్మం పట్టణంలోని ఎస్ బీఐటీ కాలేజీలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు కష్టపడి చదవడం కాకుండా ఇష్టపడి చదివి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొంటున్న విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లి దండ్రులను, ఈ పోటీ పరీక్షలను నిర్వహిస్తున్న ఇండియన్ బ్రిలియంట్స్ ఒలంపియాడ్ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ, సిబ్బందిని ఈ సందర్భంగా కరస్పాండెంట్ పంచకం నర్సయ్య అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పరకాల ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని వారి నివాసంలో ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ మంగళవారం కలిసి సన్మానించారు. సమాచార హక్కు చట్టాన్ని బలోపేతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యేను కోరారు. ఫిబ్రవరిలో నిర్వహించే ఆర్టీఐ అవగాహన సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. నియోజకవర్గంలో ప్రజలకు, విద్యార్థులకు ఆర్.టీఐ అవగాహన సదస్సులు పెట్టి ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాలని, దీనికి మీ సహాయ సహకారాలు కావాలని విన్నవించారు. దీనికి ఆయన ఇలాంటి అవగాహన కార్యక్రమాలు పెట్టడం ప్రజలకు ఆర్టీఐ గురించి వివరించే కార్యక్రమం పెట్టడం చాలా బాగుంటుందని ఆయన సానుకూలంగా స్పందించారని చంటి ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్రవంతి, కుమార్ ముదిరాజ్, నమీండ్ల హరీష్ పాల్గొన్నారు.

## ఎస్సై అనిల్‌పై కేసు నమోదు

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ ఎస్ఐ అనిల్ పై బాధితురాలు ఫిర్యాదు మేరకు కేయూసీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మహిళ ఉద్యోగితో ఎస్సై అనిల్ పరిచయం చేసుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో ముందు నుంచి మహిళపై వేధింపులకు గురి చేస్తుండటంతో మంగళవారం కేయూ పోలీస్ స్టేషన్ లో బాధితురాలు వేధింపులకు పాల్పడ్డడని, కులం పేరుతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేయూ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# సీపీఎస్ రద్దుకు సానుకూలంగా ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** నర్సంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నర్సంపేట డివిజన్ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని కలిసి ఆయన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు సీపీఎస్ రద్దు విషయమై వినతిపత్రం సమర్పించగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సీపీఎస్ విధానం ఉద్యోగులకు చాలా నష్టదాయకమని ఉద్యోగుల సొమ్ము కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేయడం అన్యాయమని ఆ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు కూడా వినియోగించుకోవచ్చని తెలియజేశారు. కాంగ్రెస్ గతంలో రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిందన్నారు. ఇక్కడ కూడా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టామని, అదేవిధంగా మొదటి అసెంబ్లీ సమావేశాల్లోను ప్రస్తావించామని తెలిపారు. వ్యక్తిగతంగా నేను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. ప్రభుత్వం కూడా త్వరలోనే సీపీస్ రద్దు పట్ల సానుకూల నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సోనబోయిన రవిచంద్ర, నర్సంపేట మండల అధ్యక్షుడు పాత శాంప్రసాద్, కోశాధికారి గోపాలరావు, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బానోతు వెంకన్న, ఖానాపురం మండల అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి పూనేం సురేందర్, నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శి బానోతు నరసింహ, జిల్లా బాధ్యులు మనుకొండ రమేష్, బానోతు స్వామి, బానోతు రాజు, నాంపల్లి రాజశేఖర్, గూడూరు మండల బాధ్యులు పోశాల చంద్రమౌళి, ప్రవీణ్, మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ గుగులోత్ శేఖర్, వంగ సంతోష్, రాజేందర్, రాజ్ కుమార్, కటేశ్వర్లు, వీరబాబు, 317జీఓ బాధితుల సంఘం రాష్ట్ర బాధ్యులు గొడిశాల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయిలను రక్షిస్తే -అమ్మను గౌరవించినట్లే

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



**వరంగల్ వాయిస్, ములుగు :** మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖ ద్వారా జిల్లా సంక్షేమ అధికారి ఈ పి.ప్రేమలత ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలిక దినోత్సవ వేడుకలలో భాగంగా ములుగు జిల్లాలోని మేడారంలో ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ ఏ.శరత్, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్.పి.శబరీష్, బాలికలని రక్షిద్దాం చదివిద్దాం - బేటి బచావో బేటి పడావో అనేటటువంటి ఉద్దేశంతో కూడిన స్టిక్కర్లను పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు బాలికల సంరక్షణకు అన్ని విధాల కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసి వాల్ పోస్టర్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా గౌరవ అతిథులు మాట్లాడుతూ బాలికలను సంరక్షించడం మన ప్రాథమిక బాధ్యత అని, బాధ్యత గల ప్రతి అధికారి బాలికల సంరక్షణకు కృషి చేయాలని, ఆడపిల్లల్ని రక్షిస్తే అమ్మను గౌరవించినట్లేనని తెలిపారు. బాలికల సంరక్షణకు జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నటువంటి మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులను ప్రశంసించారు. బాలికల సంరక్షణకు జిల్లాలోని అన్ని ప్రాంతాలు గ్రామాలలో ఉన్న ప్రజలకు సంపూర్ణంగా బాలల హక్కుల సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండా మేడారం మహా జాతరలో బాలికల అంశాల పైన ప్రత్యేకంగా అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వారి సిబ్బందితో పాటు, జిల్లా సంక్షేమ అధికారి ఈ.పీ.ప్రేమలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జే.ఓంకార్, సఖి సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ అడుగుజాడల్లో నడవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామా జగన్ మోహన్ మెమోరియల్ ట్రస్ట్ వారు నిర్వహిస్తున్న కాకతీయ హెరిటేజ్ -2024 క్రీడా పోటీలు మంగళవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ ఏలేటి నాగరాజు మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రతి ఏటా స్వామి వివేకానంద మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న యువజన ఉత్సవాలు క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు క్రీడా పోటీల ద్వారా మానసిక ఉల్లాసానికి కూడా పెంపొందించుకోవాలన్నారు. అదే విధంగా స్వామి వివేకానంద, నేతాజీ అడుగుజాడల్లో నడచి వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుగు శ్యామ్, డాక్టర్ తుమ్మ ప్రభాకర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ బన్న ఐలయ్య, ప్రాంత సహ సంఘటన కార్యదర్శి తోట లవన్ కుమార్, విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, విభాగ్ కన్వీనర్ అయితే నిఖిల్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, వరంగల్ జిల్లా కన్వీనర్ దేవేందర్, గేమ్స్ కన్వీనర్ మారోజు యశ్వంత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

## నేతాజీ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** నేతాజీ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని, గొప్ప స్వతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్వతంత్ర పోరాటంలో నేతాజీ అనుసరించిన పంథా ఎందరికో ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, సూరసి కృష్ణ, మహేష్, పోలపల్లి రామ్ మూర్తి, చాగంటి రమేష్, మాడిశెట్టి వరుణ్, నెల్లుట్ల సారంగం పాల్గొన్నారు.

## అల్-అన్సార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని నేతాజీ విగ్రహానికి పూల మాలవేసి అల్ -అన్సార్ యూత్ అసోసియేషన్ ఈద్గా బజార్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ తాను బాల్యంలోనే ఇంగ్లీష్ స్కూల్ లో చదువుతున్న సమయంలో బ్రిటిష్ విద్యార్థులు, అధ్యాపకులు మన భారతీయ విద్యార్థులపై వివక్ష చూపించేవారని, విద్యార్థి దశలోనే పోరాటాలు, వ్యాధిగ్రస్తులకు సేవా కార్యక్రమాలు చేస్తూనే స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో తన వ్యూహాత్మక ఆలోచనల శైలితో బ్రిటిష్ వారిపై పోరాటాలు సాగించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పాలక వర్గ సంబంధిత అధికారుల అనుమతితో మెట్లు నిర్మిస్తామని ప్రకటించారు.

## సుభాష్ చంద్రబోస్ పోరాటం మరువలేనిది



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల వరంగల్ ఆవరణలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ సోనబోయిన సతీష్ మాట్లాడుతూ మీ రక్తాన్ని ధారబోయండి నేను స్వాతంత్రం సాధించి పెడతానని ఉగ్రూతలూగించిన సుభాష్ చంద్రబోస్ మాటలు ఆనాటి యువతరాన్ని స్వాతంత్ర సమరంలో పాల్గొనేటట్టు చేశాయన్నారు. స్వామి వివేకానంద, భగత్ సింగ్ తరువాత దేశ యువతపై అత్యంత ప్రభావం, చైతన్యం కలిగించిన వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పరాశరం రంగాచార్యులు, మేకల లింగమూర్తి , పరాశరం జయకృష్ణ , శ్రీధర్ల కుమారస్వామి , శెట్టి దేవరాజు, యెగ్గడి సుస్మిత , అనధ్యాపకులు ఎం రవీందర్, పి.రాజు, సీహెచ్.లింగయ్య, పి.వనమ్మ, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

### టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీపీటీఎఫ్ -2024 సంవత్సరపు డైరీ, వాల్ క్యాలెండర్ ను వరంగల్ లో మంగళవారం ఆవిష్కరించారు. వరంగల్ ఖిలా వరంగల్ మండల విద్యాశాఖ అధికారి ఎన్.విజయ కుమార్ చేతుల మీదుగా డైరీ, వాల్ క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్ హాజరై మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు బెల్లంకొండ పూర్ణచందర్, వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి డి దినేష్, పూర్వపు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు అశోక్, ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు వి.అజయ్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు జె.స్వామి, జిల్లా కార్యదర్శి ఎంఎ కె.తస్వీర్, నియామత్, హైమద్ సిబ్బంది యాదగిరి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఎంజీఎం యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎంలో టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ ఆధ్వర్యంలో జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం ఎన్నికల అధికారిగా నిర్వహించిన కార్యవర్గసమావేశంలో టీఎన్జీవోస్ ఎంజీఎం యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గజ్జల రామ్ కిషన్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందంజలో ఉండాలన్నారు. జిల్లా కార్యదర్శి గాదె వేణుగోపాల్ మాట్లాడుతూ ఎంజీఎం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ సంఘం బలోపేతానికి ప్రతి ఉద్యోగి సంఘటితంగా పనిచేయాలని కోరారు . టీఎన్జీవోస్ ఎంజీఎం యూనిట్ అధ్యక్షుడిగా బొమ్మగాని రవికుమార్, కార్యదర్శిగా కే రవీందర్, కోశాధికారిగా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఉపేందర్, సుధామణి, యాదగిరి, అశోక్, భాస్కర్, ఇజాజ్ బేగం సంయుక్త కార్యదర్శులుగా రాజయ్య స్వరూప లింగమూర్తి, రవీంద్రనాథ్, శ్రీనివాస్ కార్యనిర్వాహక కార్యదర్శిగా గోపి కిషన్ నాయక్, అర్చన, సలీం, ప్రచార కార్యదర్శులుగా సుదర్శన్, ఉషారాణి, వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా భరత్ భూషణ్, భిక్షపతి, పూర్ణచందర్ రెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం ఉపాధ్యక్షులు గద్దల రాజు యాకమ్మ సంయుక్త కార్యదర్శి శ్రీ జ్యోతి నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రమీలావతి తిరుమల సిటీ అధ్యక్షులు వెలిశాల రాజు జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం బాధ్యులు మల్లేశం, శ్రీకాంత్, భిక్షపతి, అజయ్, ఎంజీఎం ఉద్యోగులు మధు, శ్రీకళ, సత్యనారాయణ, భరత్, చిరంజీవి, తదితర ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఏఐఎస్బీ అధ్వర్యంలో ..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా లో ఏఐఎస్ బీ ఆధ్వర్యంలో ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ బీ హనుమకొండ జిల్లా నాయకులు అరవింద్, విజయ్ లు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం ఉద్యమంలో నేతాజీ ప్రధాన పాత్ర పోషించి బ్రిటీష్ పాలకులను తరిమికొట్టి దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహా నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సందీప్, బన్నీ , మోహ్సిన్, అయాన్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయాలి

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణ కేంద్రంలో స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో, తొర్రూరు మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై, పలు సమస్యలపై సమావేశంలో. ముఖ్యంగా తొర్రూరు పట్టణ కేంద్రంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, కరెంటు సమస్యలపై, కుక్కల నివారణ చర్యలపై, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీపై, పెండింగ్ పనులను తక్షణమే చేయాలని సూచించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తొర్రూరు పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు ఎల్లపుడూ అందుబాటులో ఉండాలని అధికార్లను సూచించారు. ప్రజల మీద ఎలాంటి భారం పడే ఏ ఒక్క పని కూడా చేయొద్దని అధికారులను సూచించారు. మున్సిపాలిటీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఒక మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు అధికారులందరూ ముందుండి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మంగళంపల్లి రామచంద్రయ్య వైస్ చైర్మన్, జినుగు సురేందర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్, సరస్వతి వార్డు కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రీసైక్లింగ్ విధానం పర్యావరణానికి మేలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రీసైక్లింగ్ విధానం పర్యావరణానికి మేలు చేస్తుందని రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కుసుమ సురేష్ అన్నారు. కిషన్ పురాలోని మాస్టర్ జీ హై స్కూల్ లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.




ఐటీసీ సంస్థ విద్యార్థుల నుంచి వాడిన పుస్తకాలను రాసిన నోట్స్ లను సేకరించి, వాటి విలువకు సరి సమానమైన ఐటీసీ ఉత్పత్తులను విద్యార్థులకు ఇచ్చి దాంతో పాటు ప్రశంసా పత్రంతో సత్కరించనున్నట్లు"ఇంటర్ క్లాస్ రీసైక్లింగ్ ఛాంపియన్ షిప్"అన్న పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించి విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య కరసేవకుడికి సన్మానం

**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలో తిరుమలగిరికి ప్రముఖ జర్నలిస్టు కటకం రాజును మంగళవారం పూర్వ ఏబీవీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ నాయకులు మాట్లాడుతూ కటకం రాజు విద్యార్థి దశలో విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీలో ఉండి పోరాటం చేస్తూ భారత ఉక్కుమనిషి ఎల్ కే అద్వాని



పిలుపుమేరకు అయోధ్య రామ మందిర వివాదంపై దేశ ప్రజలందరూ పోరాటం చేస్తున్న సందర్భంలో 1990లో పరకాలలో ఇంటర్ చదువుతూ ఏబీవీపీ జనరల్ సెక్రెటరీగా పనిచేస్తూ అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం కరసేవకుడిగా 1500కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశారు. ఈ క్రమంలో ఉత్తర ప్రదేశ్ లోని అయోధ్యకు చేరే క్రమంలో అయోధ్య దగ్గరలో గల రైల్వే స్టేషన్ లో అప్పటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి మూలయం సింగ్ యాదవ్ కర సేవకులను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. ఈ సమయంలో 15 రోజులుగా జైలు జీవితం గడిపాడు. 1992 డిసెంబర్ 6న అయోధ్యకు కరసేవ కోసం వెళ్లడం జరిగింది. దానికి 32 ఏళ్ల నిరీక్షణ అనంతరం సోమవారం జరిగిన అయోధ్య బాల రాముడి దివ్య భవ్య రామ మందిర నిర్మాణంతో అతడి శ్రమకు గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా మోడీజీకి రాజు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ నాయకులు తూర్పాటి మల్లేష్, పెండ్యాల రాజు, సామల నరేందర్, వరప్రసాద్, చల్లవిక్రమ్ తిరుమలగిరి, రేగొండ గ్రామస్తులు సుంకరి మనోహర్, దయ్యాల కుమారస్వామి, నిమ్మల విజేందర్, రెంటాల వెంకటస్వామి, పన్నాటి శ్రీనివాస్, ఆకుతోట తిరుపతి, మల్యాల కొమురయ్య, కటకం సంపత్, కట్ల సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.

# 31న కార్మిక బహిరంగ సభ

## హాజరుకానున్న బీవీ.రాఘవులు, తపన్ సేన్

## సీఐటీయూ జాతీయ కార్యదర్శి పాలడుగు వెల్లడి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు హనుమకొండలోని బాలవికాసలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జాతీయ కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. మంగళవారం హనుమకొండ రాంనగర్ లోని సుందరయ్య భవన్ లో విలేకరుల సమావేశం జరిగింది. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ మొదటిసారి జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు పోరాటాల గడ్డ హనుమకొండలో జరుగుతున్నాయని, వీటిని జయప్రదం చేయాలని జిల్లా ప్రజానీకానికి ఆయన పిలుపునిచ్చారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో బీజేపీ అవలంబించిన విధానాలపై వర్కింగ్ కమిటీ సమావేశాలలో చర్చ జరుగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోతుందని, చేద్దామంటే పని దొరకడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల మూలంగా ప్రభుత్వ రంగం మొత్తం ధ్వంసం అయిందన్నారు. గడిచిన 10సంవత్సరాల కాలంలో విద్వేష, మత రాజకీయాలతో దేశ ప్రజల జీవితాలు సంక్షోభంలో కూరుకుపోయాయని, అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాల్సిన బీజేపీ సంఘ్ పరివార్ సహకారంతో విద్వేషాలను ప్రేరేపించిందన్నారు. దీంతో దేశ ప్రగతి అన్ని రంగాలలో తిరోగమిస్తుందని తెలిపారు. విదేశీ, స్వదేశీ బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తూ ఎనిమిది గంటల పని విధానానికి మంగళం పాడి 12గంటల పని విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. కనీస వేతనాల కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటాలు చేస్తుంటే




ప్రధానమంత్రి పెట్టుబడిదారులకు అనుగుణంగా ఒకరోజు ఫ్లోర్ లెవెల్ వేతనం రూ.178లను నిర్ణయించడం ప్రభుత్వం వైఖరికి నిదర్శనంగా కనబడుతుందని తీవ్రంగా విమర్శించారు. రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో కార్మిక వర్గం దేశ ప్రజానీకం అనుసరించాల్సిన ఎత్తుగడలను ఈ వర్కింగ్ కమిటీ సమావేశాలలో చర్చిస్తామని అన్నారు. జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా జనవరి 31న వేలాది మందితో కార్మిక మహా ప్రదర్శన నిర్వహిస్తామని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో బహిరంగ సభ ఉంటుందని, ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ హాజరవుతున్నారని కార్మికులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జే వెంకటేష్, రాగుల రమేష్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు టీ ఉప్పలయ్య, కాసు మాధవి, గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, జిల్లా ఆఫీస్ బెరర్స్ బొట్ల చక్రపాణి, వేల్పుల సారంగపాణి, పుల్ల అశోక్, యన్ రజిత పాల్గొన్నారు.

## గుల్లెపెల్లి శివకుమార్‌కు రక్తవీర్ పురస్కారం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి పురస్కరించుకొని మంగళవారం లూయిస్ అంధుల ఆదర్శ పాఠశాల ఆటోనగర్, వరంగల్ లో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవ, రక్తదానం చేస్తూ , రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కె.అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కన్నె రాజు ఎర్రబెల్లి ప్రదీప్ రావు చేతులమీదుగా రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ కంప్యూటర్ ఆపరేటర్, బ్లడ్ డోనార్ మోటివేటర్ : గుల్లెపెల్లి శివ కుమార్ కు "రక్తవీర్ పురస్కార్ -2024"అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 నుంచి 25సంవత్సరాలుగా మున్సిపాలిటీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని వారికి చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా ఉందన్నారు. చాలామంది పీజీలు డిగ్రీలు చేసి వయోభారం మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పిస్తాయని అనుకుంటే చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో వివిధ కేటగిరీల్లో పనిచేసే కార్మికులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేగా మా ఆవేదనను గవర్నమెంట్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాం నరసయ్య, శంకర్, వెంకన్న, యాకయ్య, శ్యామ్, రామస్వామి, వెంకన్న, ఎల్లయ్య, నరేష్, యాకయ్య, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన కాంగ్రెస్ మహిళ నాయకురాలు



**వరంగల్ వాయిస్, దామెర :** కాంగ్రెస్ నాయకులు దామర కొండ కరుణాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడిన పనిచేసిన మహిళా సోదరీమణులు మంగళవారం దేవాదయ, ధర్మాదాయ అటవీశాఖ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకెను అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెడల చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ నాయకులు కానుగంటి పద్మవతి, చిట్ల.హేమలత, భకీ కల్పన, బజ్జూరి రేణుక, అడుప లలిత, బజ్జూరి నిర్మల, చిట్ల సంధ్య, లావణ్య, భకి స్వరూప, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు అభినందనలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని అభ్యాస్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కేతిరెడ్డి నరేష్ రెడ్డి, ప్రిన్సిపల్ సుమలతలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉన్నతమైన స్థానంలో ముందుకు పోవాలని, తల్లిదండ్రులు, గురువుల పేరు ప్రతిష్టలు నిలబెట్టి భవిష్యత్తులో నలుగురికి ఆదర్శంగా నిలబడే విధంగా ముందుకెళ్లాలని సూచించారు. నేర్చుకున్న విద్యను తప్పుదారిలో కాకుండా మంచికి ఉపయోగించాలని కోరారు. రాష్ట్రస్థాయి కాకుండా దేశ, ప్రపంచ స్థాయిలో కూడా గుర్తింపు పొందేలా ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి శివ, ఉపాధ్యాయులు డాక్టర్ షేక్ అలీ, రాకేష్ ఎనమాల, బొల్లం సుభాష్, కర్ర మౌనిక, ఎండీ.పాషా, రాజు, శ్రీనివాస్, అఖిల్, చంటి, మహేందర్, కుమార్, రవీందర్, శివ శంకర్ రెడ్డి, స్వప్న, సంధ్య, వెంకన్న, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరలో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

## గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డా.శరత్



**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం మహా జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డా.ఎ.శరత్ అన్నారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డా.ఎ.శరత్, డైరెక్టర్ ఇ.వెంకట్ నర్సింహారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మేడారంలో చేపడుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వన దేవతలను దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మంచే నుంచి క్యూ లైన్ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం మేడారంలోని సమక్క ఆదివాసీ భవనం అధికారులతో సమీక్షలో సెక్రటరీ మాట్లాడుతూ, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పూర్తయిన పనులు భక్తులు అధికంగా ఇప్పటినుండే వస్తున్నందున అందుబాటులోకి తేవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం, త్రాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి తెలియజేసేటట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు, తాగునీరు, టాయిలెట్ తదితర అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలన్నారు. భక్తులకు చేపడుతున్న సౌకర్యాల కల్పనలో రాజీపడవద్దని, ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. స్టాల్స్ వద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పనులలో వేగం పెంచి చక్కగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, జాతరను విజయవంతం చేయాలన్నారు. సివిల్ పనులు మరో ఏడు రోజుల్లో పూర్తి కానున్నట్లు, రద్దీ నిర్వాహణపై దృష్టి పెట్టాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో ఫ్లడ్ లైట్లు, బ్యాటరీ ట్యాప్ లు తదితర మౌలిక వసతులు కల్పించాలని, వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ కేంద్రం మధ్య రోడ్ ను చదును చేయాలన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు జాతర మధుర జ్ఞాపకంగా ఉండాలన్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులు వారు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. బారికెటింగ్ ఏర్పాటులో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. భక్తులకు సౌకర్యార్థం ప్రతిచోటా సైన్ బోర్డులు, సలహాలు, సూచనలు ఇచ్చి, అధికారులు ఒక టీమ్ లా పనిచేసి, జాతరను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, సి.వేణు గోపాల్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.


## గండ్ర దంపతులను సన్మానించిన ఎంపీపీ విజేందర్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి దంపతులను చెన్నారావుపేట ఎంపీపీ బాదావత్ విజేందర్ సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్ర నిర్వహించుకుంటూ వెళుతుండగా మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో బస చేశారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి, వెంకటరమణారెడ్డి దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, ఎంపీడీవో ఈగల భారతి, మండల పంచాయతీ అధికారి అంబటి శ్రీధర్ రాజు, స్థానిక సర్పంచ్ కుండె మల్లయ్య, ఏపీఎం ముక్కెర ఈశ్వర్, ఏపీఓ అరుణ, మండల పరిషత్ సూపరిండెంట్ దయాకర్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, ఉపాధి హామీ ఈసీ కిషోర్, పుప్పాల రజిత, జూనియర్ అసిస్టెంట్ సమ్మయ్య, టైపిస్టు రజిత, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఐకెపి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ రమేష్ చంద్రను సస్పెండ్ చేయాలి

### ఎల్ హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా వెంకట్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలంలోని జన్ పాక ప్రాంతంలో బతుకుదెరువు కోసం వచ్చి నివసిస్తున్న గిరిజన మహిళ తేజావత్ బుజ్జిపై ఎక్సైంజ్ శాఖ సీఐ రమేష్ చంద్ర చేసిన దాడిని ఎల్ హెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా వెంకట్ తీవ్రంగా ఖండించారు. గిరిజన మహిళ తేజావత్ బుజ్జి మెయిన్ రోడ్డు నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఎక్సైంజ్ శాఖ సీఐ రమేష్ చంద్ర, ఇద్దరు కానిస్టేబుళ్లు, సీఐ వెహికల్ ప్రైవేట్ డ్రైవర్ మహేందర్ కలిసి నడిరోడ్డు మీద నానా బూతులు తిడుతూ విచక్షణ రహితంగా కొట్టారు. ఎవరు మీరు నన్ను ఎందుకు కొడుతున్నారని పలుమార్లు అడిగినప్పటికీ కులం పేరుతో దూషిస్తూ రూ.30 వేలు డిమాండ్ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కన కింద పడేసి ఇష్టం వచ్చినట్టు కొట్టారని, తిరిగి వెహికల్ లో పోయే క్రమంలో ఒక కానిస్టేబుల్ కాళ్లు పట్టుకోవడంతో వాళ్ల సెల్ నెంబర్ బుజ్జి అనే బాధితురాలి సెల్ లో లో ఫీడ్ చేసి మాకు పొద్దున ఫోన్ చేసి రూ.30 వేలు పంపించాలని డిమాండ్ చేసినట్లు వారు చెబుతున్నారు. బుజ్జి అనే మహిళ పై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేసిన సీఐ రమేష్ చంద్రను, అతడితో పాటు ఉన్న ముగ్గురు వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్ హెచ్ పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఎల్ హెచ్ పీఎస్ వరంగల్ నగర అధ్యక్షుడు భాస్కర్ నాయక్, సంతోష్ నాయక్, మోహన్ నాయక్, రంజిత్ నాయక్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీల అభివృద్ధికి రూపకల్పన చేయాలి

### జిల్లా పంచాయతీ రాజ్ అధికారి జగదీశ్వర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** గ్రామపంచాయతీలు తమకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపకల్పన సిద్ధం చేసుకోవాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి జగదీశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవన్లో మంగళవారం పరకాల డివిజన్ ఆత్మకూర్, దామెర, శాయంపేట, పర్కల్, నడికూడ మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శిలతో గ్రామపంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీ రాజ్ అధికారి జగదీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీల అభివృద్ధి పై వార్షిక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ పీఓ సుదర్శన్, ఎంపీవోలు బుర్ర రంజిత్ గౌడ్, రంగాచారి, ఈ భాస్కర్, సయ్యద్ అఫ్జల్ లతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్న లయన్స్ క్లబ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యూ శాయంపేటలో మంగళవారం లయన్ క్వెస్ట్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రామ్ లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ న్యూ శాయంపేట విలేజ్ లో జరిగిన సమావేశం లో స్థానిక గవర్నమెంట్ పాఠశాలను మొట్ట మొదట గా లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ వారు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా యస్ వీడీసీ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లడుతూ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సుభాస్ ఆర్సీ నిర్మల, రిజీయన్ సెక్రటరీ డాక్టర్ రాజేశ్వరి, ప్రెసిడెంట్ లయన్ ఆత్మీయ ప్రేమలత, కో ఆర్డినేటర్ మార్గం ప్రభాకర్, ఎంజేఎఫ్ హెడ్ మాస్టర్ అండ్ క్వెస్ట్ ట్రెయిని టీచర్ ఉపేందర్, పూర్ణచందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్ హెూల్స్ పనుల పరిశీలన




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 8వ డివిజన్ లో గల పలు ప్రాంతాల్లో ప్రజలకు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న మ్యాన్ హెూల్ లను ఎన్నో రోజుల నుంచి జీడబ్ల్యూ ఎంసీ అధికారుల దృష్టికి తీసుకొని పోవడంతో మంగళవారం స్పందించి ఇబ్బందిగా ఉన్న ప్రాంతాలు తెలంగాణ కాలేజీఎదురుగా, కుమార్ పల్లి పాల జెండా దగ్గర, గుండా నాగేశ్వర్ షాప్ దగ్గరలో ఉన్న మ్యాన్ హాల్స్ ను స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మీ కుమారి దగ్గర ఉండి పనులను పర్యవేక్షించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు కార్పొరేటర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైరి శ్రవణ్ కుమార్, డివిజన్ బీజేపీ నాయకులు అనిశెట్టి సందీప్, బైరి క్రాంతి పాల్గొన్నారు.

## యాదవ నగర్ కెనాల్ కట్ట వాకర్స్ కార్యవర్గం ఎన్నిక




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ యాదవ నగర్ కెనాల్ కట్ట వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక స్థానిక కమ్యూనిటీ హాల్ లో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్, అధ్యక్షుడిగా కుసుమ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.నరసయ్య, కోశాధికారిగా బొమ్మరాజు, సలహాదారులుగా గుండా సుధాకర్, డాక్టర్ మగ్ ధూమ్, ఉపాధ్యక్షులుగా చల్లగురువు సాంబయ్య, ఎండీ శంషాద్దీన్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా పొన్నగంటి లక్ష్మీనారాయణ, తోట వీరస్వామి, ప్రచార కార్యదర్శులుగా గుల్లపల్లి విద్యాసాగర్(రిటైర్డ్ ఎంపీడీవో), తోట రమేష్, గుజ్జు వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారుడిగా బొమ్మరాజు అనిల్ ఎన్నికయ్యారు.

## 25న టీపీసీసీ రాష్ట్ర స్థాయి సదస్సు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 25న హైదరబాద్ ఎల్ బీ స్టేడియంలో జరిగే టీపీసీసీ రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25న హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు టీపీసీసీ రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే టీపీసీసీ నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సదస్సులో ప్రతి నియోజకవర్గం నుంచి కార్పొరేటర్లు, మండల పార్టీ అధ్యక్షుడు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న టీపీసీసీ నాయకులు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# రాముడి ప్రాణప్రతిష్ట.. నాకు ప్రత్యేకం

అయోధ్యలో బాలరాయుని ప్రాణప్రతిష్ఠ సోమవారం శోభాయమానంగా జరిగింది. ఈ సందర్భంగా మెగా కోడలు లావణ్య త్రిపాఠీ ఓ ఆసక్తికర పోస్ట్ షేర్ చేసింది. అయోధ్యలో పుట్టిన ఆమె ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంది. రాముని జన్మస్థలమైన అయోధ్యలో పుట్టిన నేను ప్రాణ ప్రతిష్ట వేడుకను తిలకించటం అదృష్టంగా భావిస్తున్నాను. నాతో సహా భారతీయులందరికీ ఇది గర్వించదగ్గ విషయం. ఈ పండగ వాతావరణంలో నేను రామ్ పరివార్ జ్యువెలరీ ధరించడం సంతోషంగా ఉంది. విగ్రహ ప్రాణప్రతిష్ట కేవలం అయోధ్యలోనే కాదు దేశమంతా ప్రాధాన్యత సంతరించుకుంది. దేశమంతా ఏకతాటిపైకి వచ్చి రాముడి రాకను సంబరాలు చేసుకుంటోంది. ఇది మనందరినీ ఏకం చేసే ఉత్సవం. ఇది మనలో ఐకమత్యాన్ని, అన్ని వర్గాలవారూ ఒక్కటే అన్న భావాన్ని పెంపొందిస్తుంది. మనసులో అపార భక్తిని నింపుకుందాం.. అయోధ్యలోనే కాకుండా దేశమంతా శాంతియుతంగా ఉండాలని కోరుకుందాం.. జై శ్రీరామ్' అని తన పోస్ట్‌లో పేర్కొంది మెగా కోడలు లావణ్యా త్రిపాఠీ. ఈ పోస్ట్‌కు చీరకట్టులో ఉన్న ఫోటోను జత చేసింది. శ్రీరామపట్టాభిషేకాన్ని సూచిస్తున్నట్లుగా ఉన్న రామ్ పరివార్ ఆభరణం ఆకట్టుకుంది. ఆ ఆభరణాన్ని ధరించి అయోధ్య రామాలయ ప్రారంభ కార్యక్రమాన్ని సెలబ్రేట్ చేసుకుంది లావణ్య త్రిపాఠీ.

## మిస్ పర్‌ఫెక్ట్ వెబ్ సీరిస్

తెలుగు వెబ్ సిరీస్‌లు ఇప్పుడు విరివిగా వస్తున్నాయి. ప్రముఖ నటి లావణ్య త్రిపాఠీ, బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో 'మిస్ పర్ఫెక్ట్' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ని నిన్న విడుదల చేశారు. ఈ వెబ్ సిరీస్‌లో అభిజీత్ మెయిన్ రోల్ చేస్తున్నారని అన్నప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యాను అని చెప్పాడు దర్శకుడు విశ్వక్. 'నేను బిగ్ బాస్ చూడలేదు, కానీ అభిజీత్ చేసిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్', మరికొన్ని ప్రాజెక్ట్స్ చూశాను. తను ఆడిషన్ ఇవ్వాల్సిన అవసరం లేకున్నా..ఈ సిరీస్ కోసం ఆడిషన్ ఇచ్చాడు'. అని చెప్పాడు దర్శకుడు. ఇందులో లావణ్య లీడ్ రోల్ చేస్తున్నారు అనగానే ఆమె చేసిన 'అందాల రాక్షసి' లో ఆమె పర్ ఫార్మెన్స్ ఎలా ఉందో అలాంటి పర్ ఫార్మెన్స్ ఈ వెబ్ సిరీస్ లో కూడా తీసుకురావాలని అనుకున్నాను. కొత్త టాలెంట్ ను ప్రోత్సహించడం అంటే నాగార్జునకి చాలా ఇష్టం. న్యూ టాలెంట్ ను వెలుగులోకి తీసుకురావడమే ఈ సంస్థ ఉద్దేశం. ఇప్పుడు ఈ 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ తో మేము అదే ప్రయత్నం చేశాం, అని చెప్పారు నిర్మాత యార్లగడ్డ సుప్రియ. ఈ జర్నీలో హాట్ స్టార్ చాలా సపోర్ట్ చేసింది. ఈ సిరీస్ కోసం చాలా మంది అమ్మాయిలు నో చెప్పిన క్యారెక్టర్ చేస్తానంటూ ముందుకు వచ్చి తన గట్స్ ఎంటో ప్రూవ్ చేసింది అభిజ్ఞ. 'సోగ్గాడే చిన్ని నాయన' టైమ్ నుంచి లావణ్యతో నాకు మంచి స్నేహం ఉంది. మిస్ పర్ఫెక్ట్ కు తనే పర్ఫెక్ట్ అనిపించింది.

# సిద్దార్థ్ రాయ్ ట్రైలర్ విడుదల


చాలా చిత్రాల్లో బాల నటుడిగా నటించిన దీపక్ సరోజ్ ఇప్పుడు కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్దార్థ్ రాయ్'. దీనికి వి యశస్వి దర్శకత్వం వహించాడు. రథన్ సంగీతాన్నందించిన ఈ సినిమా ట్రైలర్ ఈరోజు విడుదలైంది. ఇందులో దీపక్ సరోజ్ సిద్దార్థ్ రాయ్ గా కనిపిస్తాడు, అలాగే అతని పాత్రకి రెండు వైవిధ్యాలున్నాయని అర్థం అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ చూసాక ఇది కొంచెం అర్జున్ రెడ్డి సినిమాతో పోలుస్తారు అని అనిపిస్తోంది. ఈ సినిమా టీజర్ గత సంవత్సర విడుదలైంది, అప్పుడే ఈ సినిమా ఒక విభిన్నమైన ప్రేమకథా చిత్రమని తెలిసింది. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్ చూసాక ఈ సినిమా కచ్చితంగా వైవిధ్యంగా వుండబోతోంది అని కూడా తెలుస్తోంది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు ఈ సినిమాకి పనిచేశారని చిత్ర నిర్వాహకులు చెపుతున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వి.యశస్వి. ఈ సినిమా ఫిబ్రవరి లో విడుదలవుతుందని ఈరోజు ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో చెప్పడం జరిగింది. ఇందులో కథానాయికగా తన్వి నేగి నటించగా, కీర్తన ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనుంది.



# ముంబై ఆస్పత్రి నుంచి సైఫ్ డిశ్చార్జ్



దేవర షూటింగ్‌లో గాయపడ్డ సైఫ్ అలీఖాన్ కోలుకుని ఇంటికి చేరాడు. మోకాలి శస్త్రచికిత్స అనంతరం బాలీవుడు నటుడు సైఫ్ అలీ ఖాన్ ముంబైలోని కోకిలాబెన్ ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి అయ్యారు. సైఫ్ అలీ ఖాన్ ఆస్పత్రి నుంచి తన కారులో వెళుతూ కనిపించారు. తనపై ప్రేమ కురిపిస్తున్న శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలని అన్నారు. ఇక హైదరాబాద్‌లో దేవర షూటింగ్ చిత్రీకరణ సమయంలో సైఫ్ అలీఖాన్ భుజానికి గాయమైంది. దీంతో సైఫ్ అలీఖాన్ ముంబైలోని కోకిలాబెన్ ఆస్పత్రిలో చేరాడు.



# ఇండియానా జోన్స్‌లా మహేశ్ సినిమా

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, అగ్ర దర్శకుడు రాజమౌళి కలయికలో 'ఎస్ఎస్ఎంబీ29' రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని సినీ ప్రియులు ఎంతో ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిత్ర రచయిత వి.విజయేంద్ర ప్రసాద్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా గురించి అప్‌డేట్ ఇచ్చారు. ఆ చిత్రం 'ఇండియానా జోన్స్'లా ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఈ సినిమాకి టైటిల్ ఖరారు కాలేదు. కథ ఎక్కువగా అడవి నేపథ్యంలో సాగుతుంది. పీరియాడికల్ కథ కాదు. స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి. మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయని తెలిపారు. 'ఈ సినిమాతో మహేశ్‌బాబు ఇమేజ్ మరింత పెరిగే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు 'ఏ సినిమాలో అయినా ప్రధాన పాత్ర పోషించే నటులకు మంచి గుర్తింపురావాలని మా వంతు ప్రయత్నం చేస్తాం' అని విజయేందప్రసాద్ పేర్కొన్నారు. అంతే కాదు బాలీవుడ్‌లో 'బజరంగి భాయిజాన్' సీక్వెల్ కథ పూర్తయిందని, సల్మాన్‌ఖాన్‌కు వినిపించానని చెప్పారు. చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభమవు తుందనేది చూడాలన్నారు. తన డ్రీమ్ ప్రాజెక్టు అయిన 'సీత'ను హాలీవుడ్ స్థాయిలో రూపొందిస్తామని, ఆ పాత్రకు సరిపడ కొత్త నటి కోసం అన్వేషిస్తున్నామని చెప్పారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

**అందరి సూచనలతో ముందుకెళ్తా**

**ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తా..**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**

**ధర్మారం పార్టీ ఆఫీసులో బాధ్యతలు స్వీకరణ**





**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పార్టీ బలోపేతానికి సమష్టిగా పని చేస్తూ, రానున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు అన్ని ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తన తల్లి దీవెనలు తీసుకున్న రవికుమార్ బీజేపీ కార్యాలయాన్ని బయలు దేరారు. బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు పుస్తకంలో సంతకం చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉత్సాహంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. 500 సంవత్సరాల కలను ప్రధాని నరేంద్ర మోడీ సాకారం చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రామ మందిరాన్ని నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషించిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యత తీసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సాక్షాత్తు శ్రీరామచంద్రుడే ఇచ్చిన వరంగా భావిస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడి హెూదాలు మొత్తం జిల్లా వ్యాప్తంగా పర్యటించి పార్టీ బలోపేతానిక కృషి చేస్తానని ప్రకటించారు. పూర్తి స్థాయిలో పనిచేస్తూ పార్టీ పురోభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. అందరం కలిసి పని చేయడం ద్వారా పార్టీ బలం పెరుగుతుందని, తద్వారా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయ శంఖారావం పూరించవచ్చన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, పార్టీ పెద్దలకు రవి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేస్తే పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందనడానికి తన నియామకమే నిదర్శనం అన్నారు. జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేస్తానని రవికుమర్ పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దేశం ప్రధాని మోది పాలనను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గంట రవికుమార్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా రాష్ట్ర నాయకులు, వరంగల్ జిల్లా నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, జిల్లా పదాధికారులు, మండల, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి..

స్వాతంత్ర్య సమరవీరులలో అగ్రగణ్యుడు, అలుపెరుగని పోరాటయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు జయంతి తప్ప నేటికీ వర్ధంతి లేదన్నారు. పోరాడితే తప్ప స్వాతంత్యం రాదని భావించి ఎవరెస్టు శిఖరంపైన హిందూ సమరస్తంభాన్ని నిలిపిన ధీరోదాత్తుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు.



# బాలుడిని పరామర్శించిన మేయర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కుక్కకాటుకు గురై వరంగల్ లోని గార్డియాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని మంగళవారం మేయర్ గుండు సుధారాణి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నగరంలో కుక్కల బెడద లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# ఎన్డీఆర్ఎఫ్ సేవలు గొప్పవి

**అదనపు కలెక్టర్ మహేందర్‌జీ**





**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రకృతి విపత్తులు, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఎన్డీఆర్ఎఫ్ సేవలు ఎంతో గొప్పవని, నిజంగా అభినందనీయమని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జాతీయ విపత్తు స్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మాక్ డ్రిల్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రేడియేషన్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏ విధంగా రక్షిస్తారనే వివరాలను ఎన్డీఆర్ఎఫ్ ఇన్ స్పెక్టర్ గౌతమ్ కుమార్ వివరించారు. రేడియేషన్ ప్రమాదం సంభవించిన ప్రాంతంలో వ్యాప్తిని అరికట్టేందుకు ఎన్టీఆర్ఎఫ్ బృందం ప్రత్యేకమైన దుస్తులు, మాస్కులు ధరించి రక్షణ చర్యలు చేపడతారనే విషయాలను ప్రత్యక్షంగా ఎన్టీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. రేడియేషన్ ప్రమాదం సంభవించిన ప్రాంతంలో బాధితులను అంబులెన్స్ ద్వారా ఏ విధంగా తరలిస్తారో ప్రత్యేకంగా ప్రదర్శన చేశారు. ఫైరింజన్ ద్వారా ప్రమాద ప్రాంతంలో ఏ విధమైన చర్యలు చేపడతారనే విషయాన్ని డెమో ద్వారా తెలియజేశారు. అనంతరం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ విపత్తుల సంభవించిన ప్రాంతంలో తక్కువ సమయంలో విపత్కర పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు, ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం సేవలు ఉన్నతమైనవని అన్నారు. భూకంపాలు, తుఫానులు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏ విధంగా స్పందిస్తుందనే విషయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్డిఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ కెమికల్ రేడియేషన్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏ విధంగా రక్షణ చర్యలు చేపడుతుందనే విషయాన్ని మాక్ డ్రిల్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వై.వి గణేష్, డీఎంహెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎం.భగవాన్ రెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.జయపాల్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ ఎ.నాగరాజు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా ఝులిపించింది. వరంగల్ చౌరస్తా ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేసిన వర్ణం షాపింగ్ మాల్ నిర్మాణాలను బల్దియాకు చెందిన టౌన్ ప్లానింగ్, డీఆర్ ఎఫ్ సిబ్బంది పోలీసుల సహకారంతో సిటీ ప్లానర్ వెంకన్న నేతృత్వంలో మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలు, బిల్డర్లు, అపార్ట్మెంట్ నిర్మాణదారులు నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలన్నారు. ధ్రువీకరించిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. నగరంలో చాలావరకు అపార్ట్మెంట్ సిల్ట్ ఫోర్ ఫ్లస్ అనుమతులు పొంది అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సిల్ట్, సెల్లార్ అనుమతులు అనేవి కేవలం పార్కింగ్ కోసం మాత్రమే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వర్ణం షాపింగ్ మాల్ యాజమాన్యం బిల్డింగ్ నిర్మాణానికి సిల్ట్ ఫోర్ ఫ్లస్ అనుమతులు పొంది దానిని కమర్షియల్ అవసరాలకు వినియోగించడమే కాకుండా రోడ్డు వైపు ఉన్న ప్రాంతాన్ని కబ్జా చేసి వాడుకోవడం జరిగిందన్నారు. వారు నిర్మించిన సెల్లార్ కు అనుమతి లేదని, ఆక్యుపెన్సి సర్టిఫికెట్ పొందకుండా ఆక్రమణలు చేపట్టారన్నారు. పూర్తిస్థాయిలో అనుమతి తీసుకోని కారణంగా వాటిని తొలగించామన్నారు. విద్యుత్ కనెక్షన్ ను తొలగించాల్సిందిగా ఎన్ సీడీసీఎల్ వారికి లేఖ రాయడం జరిగిందన్నారు. ఆక్రమణ నిర్మాణాల గురించి ఇప్పటివరకు సదరు యాజమాన్యానికి పలుమార్లు నోటీసులు అందజేసినప్పటికీ రాతపూర్వకంగా ఏలాంటి స్పందన లేకపోవడంతో సిల్ట్ పోర్షన్ పార్కింగ్ గోడలు, రోడ్డును ఆక్రమించిన ఏరియాలో ఉన్న



నిర్మాణాలను తొలగించామన్నారు. మూడు రోజుల్లో నిబంధనల మేరకు పునః నిర్మాణం జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రేటర్ పరిధిలో ప్రధానంగా మడికొండ, హనుమకొండ, కాశిబుగ్గ, నక్కలగుట్ట, కేయూసీ జంక్షన్, కరీంనగర్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వారంలోగా అట్టి నిర్మాణాలకు సంబందించిన సవరణలు చేపట్టాలని లేకుంటే బల్దియా తరపున చర్యలు చేపడతామని కమిషనర్ హెచ్చరించారు. అదేవిధంగా నగరంలో సెల్లార్, డీవియేషన్, రోడ్డు ఆక్రమణలను స్వతహాగా తొలగించుకోవాలన్నారు. మంగళ వారం ఉదయం వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ వరకు చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్ లో ర్యాంప్ ల ఆక్రమణలు తొలగించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా హనుమకొండ జాలేశ్వరాలయం ప్రక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో బల్దియా టౌన్ ప్లానింగ్, డీఆర్ ఎఫ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com